క్లుప్తంగా

సైకాలజీలో రాధకు డాక్టరేట్



రామన్నపేట : వరంగల్ లాల్ బహదూర్ బీఈడీ కళాశాలకు చెందిన సీనియర్ అధ్యాపకురాలు కె.రాధకు మధ్యప్రదేశ్ భోపాల్‌కు చెందిన మానస సరోవర్ గ్లోబల్ యూనివర్సిటీ సైకాలజీ విభాగంలో డాక్టరేట్ ప్రదానం చేసింది. అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.రంజిత్ కుమార్ పర్యవేక్షణలో 'ఎఫీకసీ ఆఫ్ కౌన్సిలింగ్ ఇంటర్వెన్షన్ ఫర్ రెడ్యూసింగ్ సైకో సోషల్ ఇష్యూస్ విత్ స్పెషల్ రెఫరెన్స్ టు టీనేజర్'అనే అంశంపై పరిశోధనాత్మక గ్రంథాన్ని సమర్పించారు. తన పరిశోధనలో రాధ టీనేజర్స్ ఎదుర్కొనే సమస్యలు, వారి సామాజిక, మానసిక సర్దుబాటు గురించి వివరించారు. డాక్టరేట్ పొందిన రాధను కేయూ రిజిస్ట్రార్ రామచంద్రం, నగర మేయర్ గుండు సుధారాణి, యూజీఏ అధ్యక్ష, కార్యదర్శులు గోపాలచార్యులు, బి.ఎస్.రాజేశ్వర్, కళాశాల చైర్మన్ బి.శ్యాంసుందర్, సెక్రటరీ ప్రేమ్‌కుమార్ రెడ్డి అభినందించారు.

నిట్‌లో ఎఫ్‌డీపీ ప్రోగ్రాం ప్రారంభం

కాజీపేట అర్బన్ : నిట్ వరంగల్‌లోని బయోటిక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో సోమవారం అడ్వాన్స్‌మెంట్ అండ్ ఇన్నోవేటివ్ ఇన్ బయో ఫ్యూయల్స్, బయోరీఫైనరీస్ అనే అంశంపై ఐదు రోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ (ఎఫ్‌డీపీ) ప్రోగ్రాంను బయోటెక్నాలజీ హెడ్ రామరాజు ఆన్‌లైన్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బయోఫ్యూయల్స్, బయో రీఫైనరీస్‌పై నూతన ఆవిష్కరణలతో పాటు బోధనకు ఎఫ్‌డీపీ తోడ్పడాలని అన్నారు. కార్యక్రమంలో ప్రపంచ వ్యాప్త వివిధ కళాశాలల నుండి ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

న్యూశాయంపేట : తెలంగాణ రాష్ట్ర సాధనలో పాల్గొన్న ఉద్యమకారులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం తెలంగాణ జనసమితి వరంగల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో వరంగల్ కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రం అందించారు. ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, అమరుల కుటుంబాలకు పెన్షన్, 250 గజాల ఇంటి స్థలం, సంక్షేమ పథకాల్లో ప్రత్యేక అవకాశాలు కల్పించాలని వినతిలో పేర్కొన్నారు. వినతిపత్రం అందించిన వారిలో రాష్ట్ర నాయకులు అంబటి శ్రీనివాస్, జి.రాంచందర్, జిల్లా నాయకులు షేక్ జావిద్, చిల్లా రాజేంద్రప్రసాద్, రవీందర్, రాజేశ్, సదానందం, తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి

హన్మకొండ : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం మేడిగడ్డ వద్ద గోదావరి నదిలో స్నానం చేయడానికి వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందిన బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ మాల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పెరుమాండ్ల వెంకటేశ్వర్లు కోరారు. ప్రభుత్వం మృతి చెందిన ప్రతీ ఒక్కరికి రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు.

పుస్తకాల బహూకరణ

కేయూ క్యాంపస్ : బాలల సంక్షేమ కమిటీ మాజీ చైర్మన్ మండల పరుశరాములు సోమవారం హనుమకొండ సుబేదారిలో ఉన్న యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ లైబ్రరీకి పుస్తకాలను లైబ్రేరియన్ కె.నర్సయ్యకు అందజేశారు. విద్యార్థులు ఆయా పుస్తకాలను వినియోగించుకోవాలని ఆయన కోరారు.

ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా రంజిత్

హన్మకొండ అర్బన్ : హనుమకొండ తహసీల్దార్ శ్రీపాల్‌రెడ్డి ఇటీవల గుండెపోటుతో మరణించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో హనుమకొండకు తహసీల్దార్‌గా కే టాయించాల్సి ఉండగా రెవెన్యూ సదస్సుల నేపథ్యంలో హనుమకొండ నాయబ్ తహసీల్దార్‌గా రంజిత్‌ను హనుమకొండ ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా కొనసాగాలని కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. సదస్సులు ముగిసిన అనంతరం తహసీల్దార్ కేటాయించే అవకాశం ఉంది.

12న నృత్యోత్సవం

హన్మకొండ కల్చరల్ : ఈ నెల 12న తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో సద్గురు శ్రీశివానంద నృత్యమాల ఆధ్వర్యంలో నృత్యోత్సవం-2025 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని నృత్యమాల వ్యవస్థాపకులు, నృత్యగురువు బొంపల్లి సుధీర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం సాయంత్రం కాళోజీ కళాక్షేత్రంలో జరిగే నృత్యోత్సవంలో ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా, సీపీ సన్‌ప్రీత్‌సింగ్, మాజీ మేయర్ స్వర్ణ, చార్టెడ్ అకౌంటెంట్ గోపిచంద్ అతిథులుగా పాల్గొంటారని తెలిపారు.

సమాజ సేవలో ముందుండాలి

హన్మకొండ అర్బన్ : యువత సమాజ సేవలో ముందుండాలని పీసీసీ సభ్యుడు, రాష్ట్ర రెడ్‌క్రాస్ పాలకవర్గ సభ్యులు ఈవీ శ్రీనివాసరావు అన్నారు. వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్ సోషల్ మీడియా ఇన్‌చార్జ్ ఎండీ ముస్తాక్ నేహాల్ జన్మదినాన్ని పురస్కరించుకొని సోమవారం నగరంలోని రెడ్‌క్రాస్ సొసైటీలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసిన రక్తదానం నిర్వహించారు.

అధ్వానంగా కాకాజీ కాలనీ

- వర్షమొస్తే జలమయమే
- అస్తవ్యస్తంగా అంతర్గత రోడ్లు
- ప్రమాదకరంగా డ్రైయినేజీ



గుంతలుపడి, కంకరతేలిన కాకాజీ కాలనీలోని అంతర్గత రోడ్డు



ప్రమాదకరంగా ఉన్న డ్రైయినేజీ

హన్మకొండ చౌరస్తా : ప్రైవేటు ఆస్పత్రులకు నిలయమైన హనుమకొండలోని కాకాజీకాలనీ అభివృద్ధికి నోచుకోవడం లేదు. అనేక వ్యాధులతో పొరుగు జిల్లాల నుంచి వచ్చే రోగులకు ఇక్కడి సమస్యలు రోత పుట్టిస్తున్నాయి. పేరు గాంచిన డాక్టర్లు ఉన్నారంటూ ఇక్కడికి వచ్చే రోగులకు కాకాజీకాలనీని చూడగానే పేరు గొప్ప ఊరు దిబ్బ అనే సామెతను గుర్తు చేసుకుంటున్నారు. మల్టీప్లెక్స్ కాంప్లెక్స్‌లు, అద్దాల మేడలు గల కాకాజీకాలనీలో గంతలమయమైన అంతర్గతరోడ్లు వెక్కిరిస్తున్నాయి. ఏళ్లతరబడి వెంటాడుతున్న సమస్యలను పరిష్కరించేందుకు అటు అధి కారులకు, ఇటు ప్రజాప్రతినిధులకు కాకాజీకాలనీ కనిపించకపోవడం బాధాకరం. 24 గంటలు రోగులు, వారి బంధువులతో రద్దీగా ఉండే కాలనీలో అంతర్గత రోడ్లు కంకరతేలి అధ్వానంగా మారాయి. కాకాజీకాలనీలో పదికి పైగా అంతర్గత సీసీ రోడ్లు ఉండగా అందులో అన్నీ పగుళ్ల బారి, కంకరతేలి దర్శనమిస్తున్నాయి. డాక్టర్లు, రోగుల బంధువులకు సంబంధించిన కార్లు, బైక్‌లు ఇరుకైన రోడ్ల వెంబడే పార్కింగ్ చేయడంతో అంబులెన్స్ వెళ్లాలంటే అతికష్టంగా మారింది. కాకాజీ కాలనీలో రోడ్లన్నీ ఇరుకుగా మారడంతో అత్యవసర వైద్య సేవల కోసం అంబులెన్స్‌లో వచ్చే రోగులకు తిప్పలు తప్పడం లేదు. కాలనీలోని సైడ్ డ్రెయినేజీ కనపడకుండా ఆస్పత్రుల యాజమాన్యాలు ర్యాంప్‌లు నిర్మించడంతో వ్యర్థాలు నిలిచిపోయి వరద నీరు రోడ్లపైకి చేరుతుంది. దీంతో కాలనీ మొత్తం మురికి కూపంగా మారి బయట అడుగుపెట్టలేని దుస్థితి నెలకొంటుంది.

అప్రూవల్ కోసం చూస్తున్నాం



కాకాజీకాలనీలోని అంతర్గత రోడ్లు, నాలాపై స్లాబ్ వేయడానికి రూ. 3 కోట్లతో వ్యయంతో రూపొందించిన డీపీఆర్‌ను స్మార్ట్‌సిటీ బోర్డు అధి కారులకు అందజేశాం. బోర్డు నుంచి అప్రూవల్ రాగానే పనులు ప్రారంభిస్తాం. రోడ్ల నిర్మాణంతో పాటు, చుక్క నీరు నిలబడకుండా డ్రెయినేజీలు నిర్మిస్తాం.

– వేముల శ్రీనివాస్, స్థానిక కార్పొరేటర్

శాశ్వత ప్రాతిపదికన చర్య చేపట్టాలి



వర్షాకాలం వస్తే నాలాల పూడిక తీస్తున్నామంటూ హడావుడి చేస్తున్న కార్పొరేషన్ అధికారులు, శాశ్వత ప్రాతిపదికన నాలాల అభివృద్ధి చేయకపోవడం బాధాకరం. రోడ్లు సైతం గుంతలు పడి, కంకర తేలడంతో రాత్రి వేళల్లో అటుగా భయంభయంగానే వెళ్లాల్సిన దుస్థితి.

– వెంకటాచారి, హనుమకొండ

మెనూ చార్ట్ అమలుపర్చాలి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈఓ వాసంతి

- డీఈఓ వాసంతి

విద్యారణ్యపురి : ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని తప్పనిసరిగా మెనూ ప్రకారం వడ్డించాలని డీఈఓ వాసంతి మ ధ్యాహ్నభోజన కార్మికులను కోరారు. సోమవారం హనుమకొండలోని ప్రభుత్వ డైట్‌లో స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు, కుక్ కమ్‌హెల్పర్లకు భోజన ని ర్వహణపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఆమె పా ల్గొని పలు సూచనలు చేశారు. పాఠశాలలు ఈనెల 12 నుంచి ప్రారంభమవుతున్నందున మీరు ముందుగానే పాఠశాలలకు వెళ్లి వంట చేసే ఏరియాను పరిశుభ్రం చేసుకోవాలని వంట సామాగ్రిని క్లీన్ చేసి పెట్టుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంఈఓలు నెహ్రూనాయక్, మనోజ్‌కుమార్, శ్రీధర్, రాజేష్‌కుమార్, జిల్లా సైన్స్ ఆఫీసర్ శ్రీనివాస్‌స్వామి, హెచ్‌ఎంలు జీవి రామారావు, సిహెచ్.మధు, సీసీహెచ్‌లు కవిత, సంపూర్ణ పాల్గొన్నారు.

రైల్వేకోచ్ ఫ్యాక్టరీ కార్మికులకు కౌన్సెలింగ్

మడికొండ : స్థానిక పోలీసుస్టేషన్ పరిధిలోని రైల్వే కోచ్ ఫ్యాక్టరీలో పని చేస్తున్న 300 మంది కార్మికులకు సీఐ కిషన్ సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. స్టేషన్ పరిధిలో నేరాలను అదుపు చేయడం కోసం వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికుల వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎవరైనా కార్మికులు గంజాయి, ఇతర మత్తు పదార్థాల అలవాటు ఉన్నట్లయితే మానుకోవాలని సూచించారు. వారిపై సొంత రాష్ట్రంలో ఏదైనా కేసులు నమోదైతే అలాంటి వివరాలను తెలపాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సై రాజ్‌కుమార్, పోలీసు సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.



కోచ్ ఫ్యాక్టరీ కార్మికులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఇన్‌స్పెక్టర్ కిషన్

బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి



కాజీపేట అర్బన్ : కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మండల విద్యాధికారి మనోజ్‌కుమార్

కాజీపేట అర్బన్ : బడీడు పిల్లలను ప్రభుత్వ బడుల్లో తల్లిదండ్రులు చేర్పించాలని మండల విద్యాధికారి మనోజ్‌కుమార్ తెలిపారు. కాజీపేట మండలం కడిపికొండలోని రాజీవ్‌గృహకల్ప సముదాయంలో సోమవారం ఏర్పాటు చేసిన బడిబాట కార్యక్రమంలో కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. రాజీవ్ గృహకల్పలోని బడీడు పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించేందుకు ఏకగ్రీవ తీర్మానం చేస్తున్నట్లు రాజీవ్ గృహకల్ప అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు శనిగరం సమ్మయ్య తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ప్రమీల, జమీల బేగం, కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఖిలా వరంగల్ : ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య లభిస్తుందని, బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని మండల విద్యాశాఖ అధికారి ప్రసాద్, కార్పొరేటర్ మరుపల్లి రవి, మాజీ ఎస్‌ఎంసీ చైర్మన్ అక్తర్, హెచ్‌ఎం ఆర్.మాధవి సూచించారు. సోమవారం వరంగల్ కరీమాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కార్పొరేటర్ రవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో షీటీం సీఐ సుజాత, హెచ్‌ఎంలు జయప్రకాశ్, ప్రభాకర్, ఎస్ ఎంసీ చైర్మన్ పద్మ, ఐసీడీఎస్ రమాదేవి, మెప్మా సీఓ సునీత, సూపర్‌వైజర్ మాధవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

తడి, పొడి చెత్త వేర్వేరుగా ఇవ్వాలి



తడి,పొడిచెత్తను వేర్వేరుగా అందించాలని సూచిస్తున్న బల్దియా అధికారులు

మామునూరు: ఇంటింటికీ ఉదయాన్నే వచ్చే స్వచ్ఛ వాహనానికి తడి, పొడి చెత్త వేర్వేరుగా అందజేయాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్ సూచించారు. సోమవారం ఖిలావరంగల్ మండలంలోని తిమ్మాపురం, అల్లీపురం గ్రామాల్లో నగరపాలక సంస్థ పారిశుద్ధ్య అధికారుల ఆధ్వర్యంలో తడి,పొడి చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా రవీందర్ హాజరై మాట్లాడారు. అనంతరం ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీతో పాటు ప్రతిజ్ఞ చేశారు. నగరపాలక సంస్థ పారిశుద్ధ్య జవాన్లు, కార్మికులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లు, డ్రెయినేజీల అభివృద్ధికి కృషి

- బల్దియా మేయర్ సుధారాణి

ఖిలా వరంగల్: సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, కమ్యూనిటీ హాల్స్ అభివృద్ధికి మరింతగా కృషి చేస్తున్నామని బల్దియా మేయర్ గుండు సుధారాణి, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు అన్నారు. సోమవారం మధ్యకోటలో విశ్వబ్రాహ్మణ వీధిలో రూ.27 లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, రూ.40 లక్షలతో చేపట్టనున్న యాదవవాడ, గౌడ కమ్యూనిటీ హాల్స్, పోచమ్మ దేవాలయం అభివృద్ధికి మేయర్ స్థానిక కార్పొరేటర్ బైరబోయిన ఉమలతో కలిసి మాజీ ఎమ్మెల్సీ మురళీధర్‌రావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్రికోట అభివృద్ధికి భారీ నిధులను కేటాయించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో గోపాల నవీన్‌రాజు, మీసాల ప్రకాశ్, గజ్జల శ్యామ్, శ్రీనివాస్, రవీందర్, సారంగపాణి, దామోదర్, సురేష్ పాల్గొన్నారు.



కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభిస్తున్న మేయర్ సుధారాణి, మాజీ ఎమ్మెల్సీ మురళీధర్‌రావు

క్రీడలతో మానసికోల్లాసం



మాట్లాడుతున్న డాక్టర్ అశోక్‌రెడ్డి

హసన్‌పర్తి: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని కిట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌రెడ్డి అన్నారు. కళాశాల ఇండోర్ స్టేడియంలో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి అశోక్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని పోటీలను ప్రా రంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బ్యాడ్మింటన్‌తో కండరాలు బలపడుతాయన్నారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పింగిలి రమేష్‌రెడ్డి మాట్లాడుతూ జూనియర్, సీనియర్ బాలబాలికల విభాగాలతో పాటు పురుషులు, మహిళల విభాగంలో పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 170 మంది క్రీడాకారులు తమపేర్లు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు వివరించారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రమేష్‌కుమార్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన సైప్రస్ జూనియర్ ఇంటర్నేషనల్ టోర్నమెంట్-2025 జిల్లాకు చెందిన శౌర్యకిరణ్, కీర్తి మంచాల ప్రతిభ కనబరిచి ప్రపంచ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో డబ్ల్యూడీబీఏ కోశాధికారి నాగకిషన్, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ మోహన్‌రావు, ఫిజికల్ డైరెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, జి.కిశోర్, భాస్కర్, కృష్ణవేణి, ఎం.శైలజా, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రభాకరాచారి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పనులకు శ్రీకారం

హసన్‌పర్తి : ఇందిర ఇళ్ల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. మండలంలోని నాగారంలో ఇళ్ల నిర్మాణానికి ముగ్గులు పోశారు. కార్యక్రమానికి ఆత్మకూరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తంగళ్లపల్లి తిరుపతి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్‌రెడ్డి, బీసీ సెల్ మండల అధ్యక్షుడు నక్క రవి, మైనారిటీ సెల్ అధ్యక్షుడు అన్వర్, నాగారం గ్రామశాఖ అధ్యక్షుడు రాజిరెడ్డి, దేవేందర్, లింగారెడ్డి పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాల అందజేత

ఖిలా వరంగల్: వరంగల్ 38 డివిజన్ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు సోమవారం మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు, నగర మేయర్ గుండు సుధారాణి చేతుల మీదుగా ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు. ఈసందర్భంగా మురళీధర్‌రావు ఇందిరమ్మ ఇళ్లకు కొబ్బరికాయలు కొట్టి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఉమ, లబ్ధిదారులు పాల్గొన్నారు

సైబర్ మోసాలపై అప్రమత్తత అవసరం

- ఏసీపీ పింగిళి ప్రశాంత్ రెడ్డి

కాజీపేట : అవగాహనా లోపంతో కొందరు సైబర్ మోసాలకు గురవుతున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏసీపీ పింగిళి ప్రశాంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. కాజీపేట పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత సమాచారం, బ్యాంకు ఖాతాల వివరాలు, ఓటీపీలు, పాస్‌వర్డ్‌లను ఎట్టి పరిస్థితుల్లోనూ బయటి వారికి చెప్పొద్దన్నారు. ఇటీవల సైబర్ మోసగాళ్లు కొత్త తరహా మోసాలకు తెరలేపి అమాయకులను ఆర్థికంగా దోచుకుంటున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పథకాలు, లింకులు, ఓటీపీల వంటి పేర్లతో సైబర్ మోసాలకు పాల్పడుతున్నట్లు చెప్పారు. ఇలాంటి మోసాలను గుర్తించినా, బాధితులుగా మారినా సమీపంలోని పోలీస్‌స్టేషన్ గానీ, 1930 టోల్‌ఫ్రీ నంబర్‌ను, www. cyber crime.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. ఏటీఎం కార్డులు, క్రెడిట్ కార్డుల వినియోగంలో జాగ్రత్తలు వహించాలని ఏసీపీ సూచించారు.

మావోయిస్టులతో శాంతిచర్చలు జరపాలి

- 'ఆపరేషన్ కగార్'ను నిలిపేయాలి
- ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



కేయూ క్యాంపస్ : రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

కేయూ క్యాంపస్ : మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని సానుకూలత వ్యక్తం చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవటం సరికాదని విప్లవకారులతో చర్చలు జరపాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందరెడ్డి అన్నారు. ఏ సమస్య అయినా శాంతి చర్చలతో పరిష్కారం లభిస్తుందన్నారు. సోమవారం కేయూలోని గణిత శాస్త్ర విభాగం సెమినార్ హాల్‌లో వివిధ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శాంతి చర్చలు-విద్యార్థుల పాత్ర అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. శాంతిచర్చలకు సానుకూల వాతావరణం ఏర్పడటానికి ముందుగా కేంద్రప్రభుత్వం కాల్పుల విరమణ ప్రకటించాలన్నారు. పౌరహక్కుల సంఘం రమేష్‌చందర్ మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ పేరుతో పోలీసులు, పారామిలటరీ బలగాలు ఏకపక్షంగా కాల్పులు జరుపుతూ కనీసం విప్లవకారుల శవాలను కూడా వారి కుటుంబ సభ్యులకు ఇవ్వటంలేదని ఆరోపించారు. సమావేశంలో వీసీకే పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు జిలుకర శ్రీనివాస్,భారత్ బచావో రాష్ట్ర నాయకులు వెంగల్‌రెడ్డి, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నా యకులు రాచర్ల బాలరాజు,డెమోక్రటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ కాగగోని శ్రావణ్, విరసం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు కోడెం కుమారస్వామి, తెలంగాణ ప్రజాఫ్రంట్ జిల్లాకార్యదర్శి జనగాం కుమారస్వామి , పీస్ కమిటీ రాష్ట్ర నాయకులు సాధిక్ అలీ, అభ్యుదయ రచయితల సంఘం బాధ్యులు మార్క శంకర్‌నారాయణ, సైంటిఫిక్ స్టడీ ఫోరం రాష్ట్ర కన్వీనర్ చార్వాక, పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లాకార్యదర్శి మర్రి మహేష్, టీఎస్‌డీఎస్‌ఏ రాష్ట్ర కన్వీనర్ క్రాంతికుమార్, బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర కార్యదర్శి జన్ను రాజు, తెలంగాణా స్టూడెంట్స్ ఫోరం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శ్రీధర్, బీఎస్‌ఎఫ్ కేయూ అధ్యక్షుడు శివ, ఏఐడీఎస్‌ఓ కే యూ అధ్యక్షుడు మధు, ప్రోగ్రెసివ్ స్టూడెంట్స్ ఫో రం రాష్ట్ర అధ్యక్షుడు సనత్‌జై సూర్య, పాల్గొన్నారు.

పార్టీకి సేవ చేసిన వారికే గుర్తింపు

హన్మకొండ చౌరస్తా: పార్టీ అభ్యున్నతికి, సేవ చేసిన వారికే గుర్తింపు, పదవులు లభిస్తాయని, నిజాయితీగా పనిచేసే కార్యకర్తలను గుర్తించి వారిని ప్రోత్సహించడమే ప్రధాన లక్ష్యమని హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అ న్నారు. హనుమకొండలోని కాంగ్రెస్ భవన్‌లో సోమవారం పశ్చిమ నియోజకవర్గ స్థాయి పార్టీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు జిల్లా కాంగ్రెస్ పార్టీని పునరుద్ధరించేందుకు పూర్తి స్థాయి ప్రక్షాళన అవసరమని అన్నారు. వ్యతిరేక స్వరాలు వినిపిస్తే సహించేదిలేదని హెచ్చరించారు. ప్రతి కార్యకర్తకు సముచితం స్థానం కల్పించాల్సిందేనన్న ఎమ్మెల్యే పదవుల్లో ఉండి పార్టీ కార్యకలాపాల్లో ఆసక్తి చూపని వారిని పక్కకు తప్పించాల్సి ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాసరావు, ప్రభాకర్‌రెడ్డి, కూచన రవళి, కార్పొరేటర్లు వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, రవీందర్, విజయశ్రీరజాలీ, బీసీ సెల్ చైర్మన్ విక్రమ్, డివిజన్ అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రైలునుంచి పడి వ్యక్తి దుర్మరణం

ఖిలా వరంగల్ : ప్రమాదవశాత్తు రైలునుంచి పడి ఓ వ్యక్తి దుర్మణం చెందాడు. ఈ ఘటన సోమవారం ఉదయం ఇంటికన్నె-కేసముద్రం రైల్వేస్టేషన్ మధ్య చోటు చేసుకుంది. జీఆర్పీ హెడ్ కానిస్టేబల్ రవీందర్ రెడ్డి కథనం ప్రకారం.. మృతి చెందిన వ్యక్తి 40 నుంచి 45 ఏళ్లు ఉంటాడని, మృతుడు క్రీమ్ కలర్ షర్ట్, నేవీ బ్లూ కలర్ టీ షర్ట్, బ్రౌన్ కలర్‌ఫుల్ డ్రాయర్ ధరించి ఉన్నాడన్నారు. నల్లని తల వెంట్రుకలు, గడ్డం, మీసాలు కలిగి ఉన్నాడని, ఎత్తు 5.5 చామన చాయ రంగు, గుండ్రని ముఖం, గుర్తు పట్టుటకు కుడి పక్క చాతిపై పుట్టుమచ్చ కలదు. చనిపోయిన వ్యక్తి వద్ద దానాపూర్ టు పెరంబూర్ వరకు గల రైల్వే వెయిటింగ్ లిస్ట్ టికెట్ కలదు. మృతదేహాన్ని ఎంజీఎం ఆస్పత్రి మార్చురీలో భద్రపర్చినట్లు హెచ్‌సీ తెలిపారు. సమాచారం తెలిస్తే 9849749220,8712658585 నంబర్లకు కాల్ చేయాలని జీఆర్పీ పోలీసులు కోరారు.

పశువును తరలిస్తున్న ముగ్గురిపై కేసు

మడికొండ: పశువును తరలిస్తున్న ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు. సోమవారం ఉన్నతాధికారుల సూచనల మేరకు భట్టుపల్లి చౌరస్తాలో మధ్యాహ్నం 1.30 గంటలకు వాహనాలను తనిఖీ చేస్తుండగా ఆటో అనుమానాస్పదంగా కనిపించింది. అక్కడికి పోలీసులు వెళ్లి ప్రశ్నించగా ఆటోలో నుంచి ముగ్గురు వ్యక్తులు పారిపోయేందుకు ప్రయత్నించారు. వారిని పట్టుకొని విచారించగా పొంతన లేని సమాధానం చెప్పారు. అనుమానంతో అదుపులోకి తీసుకొని విచారించగా రెండేళ్ల వయస్సు ఉన్న ఆవు దూడను తక్కువ రేటుకు కొనుగోలు చేసి దాని మాంసాన్ని ఎక్కువ ధరకు అమ్మడానికి తీసుకెళ్తున్నట్లు తెలి పారు. కడిపికొండకు చెందిన బస్కె నవీన్, దర్గా కాజీపేట అప్జల్‌నగర్‌కు చెందిన ఎండీ. యూసఫ్, రహమత్ నగర్‌కు చెందిన ఎండీ. అబిద్ హుస్సేన్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డీఐఈఓకు వినతి

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లా కేంద్రంలోని గోపాల్‌పూర్ ఏరియాలో అకాడమి పేరుతో అడ్మిషన్ల ప్రక్రియను నిర్వహిస్తున్నారని ప్రభుత్వ నియమ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న సంబంధిత అకాడమిపై చర్యలు తీసుకోవాలని ఏబీఎస్‌ఎఫ్, స్వేరోస్ బాధ్యులు సోమవారం హనుమకొండ జిల్లా డీఐఈఓ గోపాల్‌కు విన్నవించి వినతిపత్రంను సమర్పించారు.

పారిశుద్ధ్య కార్మికులకు శిక్షణ

విద్యారణ్యపురి : జిల్లా స్థాయిలో కేజీబీవీల బాలికల హాస్టల్స్, యూఆర్‌ఎస్, టీఆర్‌ఈఐఎస్‌లలోని పారిశుద్ధ్య కార్మికులకు సోమవారం హసన్‌పర్తి కేజీబీవీలో ఒక రోజు శిక్షణ ఇచ్చారు. శిక్షణలో జిల్లా విద్యాశాఖలోని జెండర్ ఈక్విటీ కోఆర్డినేటర్ సునీత పాల్గొని మాట్లాడుతూ క్లీనింగ్ హైజీన్ శానిటేషన్‌పై అవగాహన కల్పించారు.

బదిలీపై వెళ్తున్న ఎస్సైకి సన్మానం



కాజీపేట: కాజీపేట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం బదిలీపై వెళ్తున్న ఎస్సై రామారావును ఏసీపీ సత్యనారాయణ సన్మానించారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన వీడ్కోలు అభినందన సభలో ఏసీపీ మాట్లాడుతూ రెండేళ్లుగా ప్రజలతో మమేకమై పని చేసిన రామారావు సేవలు మరువలేనివని కొనియాడారు. ఆటో యూనియన్ నాయకులు శాలువాలు కప్పి మెమోంటోతో సత్కరించారు.

బిర్సా ముండాకు ఘన నివాళి

హన్మకొండ: పిన్న వయసులోనే ఆంగ్లేయులపై తిరుగుబాటు చేసిన సాహసి, స్వాతంత్ర్య సమర యోధుడు, ఆదివాసీ భగవానుడు బిర్సా ముండా అని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి, మాజీ అధ్యక్షురాలు రావు పద్మ అన్నారు. సోమవారం హనుమకొండ దీన్‌దయాల్ నగర్‌లోని బీజేపీ కార్యాలయంలో బిర్సా ముండా 125వ వర్ధంతిని నిర్వహించారు. బిర్సా ముండా చిత్ర పటానికి పూలమాల వేసినివాళులర్పించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ : వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో ఈ నెల 10న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. కుమ్మరివాడ, రామాలయం, మహంకాళి, నాగమయ్య, జడల రాంచంద్రస్, గడీ, ముసలమ్మ కుంట, ఏనుమాముల ఇండస్ట్రీస్, ఉర్సు, జన్మభూమి జంక్షన్, కాముని పెంట, ఎస్‌సీ కాలనీ, దేశాయిపేట బొడ్రాయి, సీకేఎం కాలేజీ, లక్ష్మీ టౌన్‌షిప్, రంగనాయక టెంపుల్, గ్రీన్ సిటీ, దేశాయిపేట, గొర్రెకుంట ఇండస్ట్రియల్ ఏరియా, జాన్‌పాక ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

వేద పాఠశాల నిర్మాణాన్ని నిలిపివేయాలి

హన్మకొండ అర్బన్ : భద్రకాళీ బండ్ కింద ఉన్న ఊళ్లో ఆంజనేయులు (బెస్తవాడ ఆంజనేయస్వామి దేవాలయం) ఇనామ్ భూమి సర్వే నంబర్ 817 విస్తీర్ణం ఎ1-20 గుంటల స్థలం పై లోకాయుక్తలో ఫిర్యాదు (కేసు నెం 939/బి1/2021) ఉన్నందున ఈ స్థలంలో ఇటీవల ఈ నెల 4న చేపట్టిన వేద పాఠశాల భవన నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయాలని రాష్ట్ర హిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు చీకటి రాజు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన హనుమకొండ కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. గతంలో దేవాలయ ఇనామ్ భూమిని పలువురు ఆక్రమణలకు పాల్పడినట్లు పూర్తి ఆధారాలతో లోకాయుక్తలో ఫిర్యాదు ఉందన్నారు. ఈ విషయం పై భద్రకాళీ దేవాలయ ఇన్‌చార్జ్ ఏఓ శేషుభారతిని వివరణ కోరగా ఆమె అప్పుడు లోకాయుక్త కోర్టుకు హాజరుకాలేదని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి సదరు ఏఓ శేషుభారతి అవినీతిపై చర్యలు తీసుకోని దేవాలయ భూమి అన్యాక్రాంతం కాకుండా చూడాలని కోరారు.

నేడు కంటి వైద్యశిబిరం

వరంగల్: వరంగల్ ఎల్‌బీనగర్ బీజేపీ, పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో వాసన్ ఐ కేర్ సహకారంతో నేడు(10వ తేది) ఉదయం 10 గంటలకు ఎల్‌బీ నగర్‌లోని పద్మశాలి కళ్యాణ మండపంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు బీజేపీ నాయకులు అపురూప సాయిరాం తెలిపారు. శిబిరంలో ఉచితంగా కంటి చూపుకి సంబంధించిన సమస్యలే కాకుండా కంటిలో శుక్లాలు, దుర్మాంసం పెరగడం సమస్యలను గుర్తించడం జరుగుతుందని తెలిపారు. కంటి పరీక్షలు చేయించుకున్న వారికి ఒక కూపన్ జారీ చేయడం జరుగుతుందన్నారు.

సామాజిక రుగ్మతలను రూపుమాపాలి

కేయూ క్యాంపస్ : సామాజిక రుగ్మతలను రూపుమాపేలా సమాజానికి ఉపయోగపడే పరిశోధనలపైన దృష్టి సారించాలని కాకతీయ యూనివర్సిటీ పొలిటికల్ సైన్స్ విభాగం బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్ డాక్టర్ గడ్డం కృష్ణయ్య కోరారు. సోమవారం కేయూలోని సెమినార్ హాల్‌లో నిర్వహించిన పరిశోధక విద్యార్థుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సామాజిక శాస్త్రాలు పరిశోధనా దృష్టితో సమాచార విశ్లేషణలు అందిస్తాయన్నారు.